

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

రీజనల్ కోఆర్డినేటర్ బొత్స రాక



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ ముఖ్యనేతల సమావేశం శుక్రవారం కాకినాడలో జరగనుంది. పార్టీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. కాకినాడ డి కన్వెన్షన్‌లో జరిగే ఈ సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, డీసీసీబీ, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు, సిటీ అధ్యక్షులను ఆహ్వానించారు. ఈ విషయాన్ని పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి దాడిశెట్టి రాజా గురువారం మీడియాకు తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభంకానుంది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమావేశం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు బొత్స మీడియాకు వివరించనున్నారు.

ఆర్టీసీ ఇన్‌చార్జ్ డీపీటీవోగా రాఘవకుమార్



రాజమహేంద్రవరం సిటీ: తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ స్టేట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్‌గా ఎస్‌టీపీ రాఘవకుమార్ గురువారం రాజమహేంద్రవరం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీపీటీవోగా బాధ్యతలు నిర్వహించిన పరిమ్మల అశోక విజయవాడ బదిలీ కావడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీపీటీఓగా ఉన్న రాఘవకుమార్‌కు తూర్పుగోదావరి జిల్లా డీపీటీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రయాణికులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

ఈసెట్ 25 ఫలితాల్లో 92.92 శాతం ఉత్తీర్ణత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఈసెట్ 2025 ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా 92.92 ఉత్తీర్ణత శాతం సాధించింది. అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఈనెల 6వ తేదీన జరిగిన ఈ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లాలో ఈ పరీక్ష మొత్తం 1,116 మంది పరీక్షలు రాశారు. వీరిలో 1,037 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 790 మంది పరీక్షలు రాయగా 722 మంది, బాలికల విభాగంలో 326 మంది పరీక్షలు రాయగా 315 మంది ఉత్తీర్ణత సాధించారు.

గురువుల్లో గుబులు

- ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధం
- అమల్లోకి ఆన్‌లైన్ విధానం
- దరఖాస్తులు, స్థానాల కేటాయింపు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు
- కనీసం రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారు అర్హులు
- ప్రాధాన్యత కేటగిరీల్లో భారీగా కోత
- నూతన సంస్కరణలపై టీచర్ల గుర్రు



సాక్షి, రాజమహేంద్రవరం: విద్యారంగంలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన సంస్కరణలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో ప్రాథమిక విద్యకు విఘాతం కలిగించే నిర్ణయాలు తీసుకున్నారు. తాజాగా ఉపాధ్యాయుల బదిలీల్లో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు ఉపాధ్యాయులకు రుచించడం లేదు. జీఓ నంబర్ 117 రద్దు చేయడంతో నూతన మార్గదర్శకాల మేరకు పాఠశాల విద్యాశాఖ బదిలీ ప్రక్రియ చేపట్టనుంది. బదిలీల షెడ్యూల్ నేడో రేపో విడుదలయ్యే అవకాశం ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన టీచర్ల సర్దుబాటు చేయనున్నారు. జిల్లాలో ఖాళీల సంఖ్య..? ప్రస్తుతం ఉన్న పోస్టులు..? మిగులు..? అంశాలపై ఇప్పటికే విద్యాశాఖ కసరత్తు పూర్తి చేసింది. జీవో వెలువడిన వెంటనే అందులో పేర్కొన్న విధంగా బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానించనుంది. అభ్యంతరాల స్వీకరణ అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు

ఉపాధ్యాయ బదిలీల్లో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల నియంత్రణ చట్టం–25ను అమల్లోకి తెచ్చింది. దీన్ని ప్రాతిపదికగా తీసుకుని బదిలీలు చేపట్టనున్నారు. బదిలీ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ప్రాతిపదికగా తీసుకుని స్థాన చలనం కల్పిస్తారు. జూన్ 1 నుంచి మే 31వ తేదీ వరకు విద్యా సంవత్సరంగా పరిగణిస్తారు. ఒక సంవత్సరంలో ఒక పాఠశాలలో తొమ్మిది నెలల సర్వీసు పూర్తి చేసుకుంటే ఒక అకడమిక్ ఇయర్ సర్వీసు పూర్తి చేసినట్లు భావిస్తారు. రెండేళ్లు పూర్తి చేసినవారు బదిలీలకు అర్హులుగా ప్రకటించారు. ఒకే పాఠశాలలో హెచ్ఎంగా ఐదేళ్లు, ఉపాధ్యాయులు ఎనిమిది సంవత్సరాల సర్వీసు పూర్తి చేస్తే తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనన్న నిబంధనలు తీసుకొచ్చారు. ఈ నెల 15వ తేదీ నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. గతంలో తీసుకొచ్చిన 117 జీఓకు ప్రత్యామ్నాయంగా పోస్టుల హేతుబద్ధీకరణ ప్రక్రియను చేపట్టారు. తొలుత హెచ్ఎం బదిలీలు, అనంతరం స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తారు. మోడల్ స్కూళ్లకు ఈ చట్టం వర్తించదు. పాఠశాలల వారీగా పాయింట్లు కేటాయిస్తారు. క్యాటగిరి –1కి ఏడాదికి ఒక పాయింట్, 2కు రెండు, మూడుకు మూడు, క్యాటగిరి–4కు ఐదు పాయింట్లు ఇస్తారు. హెచ్ఆర్‌లతో పాటు రోడ్డు రవాణా కారణంగా కేటగిరిలో మార్పులు ఉంటే పాయింట్లలో మార్పులు ఉంటాయి.

సిద్ధంగా సీనియారిటీ జాబితా

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలు ఇప్పటికే వెలువడటంతో సీనియారిటీ జాబితాలను విద్యాశాఖ సిద్ధం చేసింది. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడమే తరువాయి బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో ప్రారంభం కానుంది.

కేటగిరీల్లో కోత

ఉపాధ్యాయుల బదిలీల్లో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం కేటగిరీల్లో భారీగా కోతలు విధించారు. గతంలో అవకాశం ఇచ్చిన అంశాలను పూర్తిగా పక్కనబెట్టడంపై ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గతంలో నిర్వహించిన బదిలీల్లో వితంతువులు, విడాకులు తీసుకున్నవారు, మాజీ సైనికోద్యోగుల, సైనిక ఉద్యోగుల స్పౌజ్‌లు, 70 శాతంతో శారీరక, ఇతర వైకల్యం ఉన్న వారిని ప్రాధాన్యత కేటగిరిలో పరిగణించేవారు. ప్రస్తుతం అలాంటి సంప్రదాయానికి మంగళం పాడారు. వీరికి కేవలం ప్రత్యేక పాయింట్లతో సరిపెట్టనున్నారు. 70 శాతానికి పైగా వైకల్యం ఉన్నవారు, ప్రాణాంత వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న, వ్యాధిగ్రస్థులైన పిల్లలు ఉన్న వారికి మాత్రమే కేటగిరీలో బదిలీలు చేపడతామని ప్రకటించడం వివాదాలకు దారితీస్తోంది. స్పౌజ్, ఎన్‌సీసీ, స్కౌట్స్, జిల్లా స్థాయి గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల నేతలకు సైతం పాయింట్లు కేటాయిస్తారు. తమకు అన్యాయం జరిగినా.. ఎవరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించ కూడదన్న నిబంధన పెట్టారు. హైస్కూల్‌లో ప్రతి సబ్జెక్టుకు సింగిల్ టీచర్ పోస్టు ఉంటే.. ప్రాధాన్యత కేటగిరీలోని టీచర్లను నియమించరు. ఈ విధానంపై ఒక వర్గం ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. ఇదే జరిగితే తమ పరిస్థితి ఏంటన్న అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి 'తూర్పు'లో 3,851 మంది బదిలీకి అవకాశం?

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ క్యాడర్లలో సుమారు 18 వేల మంది ఉపాధ్యాయులు ఉంటారు. ఐదేళ్లు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సుమారు 3,851 మంది తప్పకుండా బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి తూర్పులో ప్రస్తుతం బదిలీల్లో సుమారు 8 వేల మందికి పైగా ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుంది. 68 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఆధునీకరించారు. 371 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మార్చారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు.

ప్రభుత్వం దృష్టికి డిమాండ్లు



పాఠశాలల పునర్నిర్మాణం, ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై రెండు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. 1: 45 రేషియోలో స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేయాలని కోరాం. అలా చేస్తేనే మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయవచ్చు. లేని పక్షంలో ఇబ్బందులు తప్పవు. ప్యార్లల్ మీడియం ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలి. ఇంగ్లిష్ మీడియం ప్రాతిపదికగా తీసుకుంటే ఇబ్బందులు తప్పవు. పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా 1: 2 నిష్పత్తిలో ఉపాధ్యాయుల కేటాయింపు జరగాలి.

–అహ్మద్ షరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్, తూర్పుగోదావరి జిల్లా

కాటన్ సేవలు చిరస్మరణీయం



ధవళేశ్వరంలో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ వీర్రాజు తదితరులు

ధవళేశ్వరం: ఆనకట్ట నిర్మాణం ద్వారా ఉభయ గోదావరి జిల్లాలను ధాన్యాగారంగా మార్చిన సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉన్న కాటన్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ఆనకట్ట నిర్మాణం ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన కాటన్.. డెల్టా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, నాయకులు శ్రీరంగం బాలరాజు, మోర్త పావనమూర్తి, గరగ శ్రీనివాస్, గునిపే అశోక్, పందెళ్ల భానుప్రసాద్, ముద్దాల అను, కోట అబ్బులు, నెల్లి కృపాకిరణ్, చింతపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో..

కాటన్ జయంతిని ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో బ్యారేజ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. గోదావరి డెల్టా సిస్టం సీఈ ఆర్ శ్రీరామకృష్ణ, ఎస్ఈ కె.గోపీనాథ్ తదితరులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాటన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్, రమణి, ఏఈ అద్దంకి సాయిరామ్, డి.రాధాకృష్ణ, సునీల్, హెచ్‌డీ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి సంపాదన కేసులో రిజిస్ట్రార్ కె.ఆనందరావు అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అవినీతి సంపాదన కేసులో జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావును అవినీతి నిరోధకశాఖ గురువారం అరెస్టు చేసింది. ఈ మేరకు ఆ వివరాలను ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ తెలిపారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్టెనోగ్రాఫర్‌గా 1995లో ఆనందరావు విధుల్లో చేరారు. తర్వాత ఆయన సబ్ రిజిస్ట్రార్‌గా, జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందారు. అయితే మార్చి 28వ తేదీన కాకినాడలో జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ కార్యాలయంలో కొంతమంది సిబ్బందితో కలిపి లక్ష రూపాయల డిమాండ్ చేశారు. దీనిపై రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఆనందరావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ కేసులో దర్యాప్తు చేస్తున్న సమయంలో ఆనందరావు ఆస్తులకు మించి ఆదాయం సంపాదించాడని సమాచారం రావడంతో ఆ దిశగా ఏసీబీ అధికారులు దర్యాప్తు చేశారు. ఆనందరావు, అతని కుటుంబ సభ్యుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నారు.

క్రీడాకారులకు వేసవి శిక్షణ శిబిరాలు



కిట్లు అందిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేందవరం): క్రీడాకారులకు అందించే క్రీడా పరికరాల కిట్ల వల్ల వారి అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటుందని జేసీ చిన్నరాముడు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో క్రీడా శిక్షకులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు మాట్లాడుతూ, వేసవి కాలంలో విజ్ఞానంతో పాటు, క్రీడలపై ఆసక్తి కలిగించే కార్యక్రమాలు చేపట్టడంలో భాగంగా ఈ నెలాఖరు వరకూ వివిధ క్రీడాంశాల్లో 50 శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిక్షకులకు రూ.5 వేల విలువ చేసే క్రీడా సామగ్రి, గౌరవ వేతనం రూ.1,500, ఇతర ఖర్చులకు రూ.500 అందజేస్తున్నట్టు చెప్పారు. క్రీడల్లో మెళకువలు నేర్పుతూ, వారికి భద్రత, ఇతర సదుపాయాలు కల్పించేలా శిబిరాలు నిర్వహించాలని నిర్దేశించారు. జిల్లాలో 15 క్రీడాంశాల్లో మొత్తం 50 క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సాధికారత అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం అథ్లెటిక్స్ 2, బాల్ బ్యాడ్మింటన్ 2, బాస్కెట్ బాల్ 8, బాక్సింగ్ 4, చెస్ ఒకటి, క్రికెట్ 3, ఫుట్‌బాల్ 5, హ్యాండ్‌బాల్ 2, జూడో 3, కరాటే 3, కబడ్డీ 3, తైక్వాండో 3, వాలీబాల్ 6, వెయిట్ లిఫ్టింగ్ 1, యోగా 4 కిట్లు అందజేశామని తెలిపారు.

ఇంత అలక్ష్యమా..

- లక్ష్యం పూర్తయిందని ధాన్యం కొనుగోలు చేయని ప్రభుత్వం
- రోడ్డెక్కిన రైతులు
- ట్రాక్టర్లతో కలెక్టరేట్ ముట్టడి
- ముందుగా ముక్తేశ్వరంలో ఆందోళన



అమలాపురం కలెక్టరేట్ ఎదుట ధాన్యం ట్రాక్టర్లు

సాక్షి,అమలాపురం/ అయినవిల్లి: సాధారణంగా వరి పంటను సాగుచేసే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు, నీటి ఎద్దడి, ఎరువుల కొరత, తెగుళ్లు తదితర సమస్యలు రైతులు ఎదుర్కొంటారు. కానీ కూటమి ప్రభుత్వంలో వారికి మరో కొత్త చిక్కు వచ్చి పడింది. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అయినా పాలకులు స్పందించక పోవడంతో రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారు. రైతుల సంక్షేమానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తే.. నేటి కూటమి ప్రభుత్వం వారిన్ని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తోంది.

కొనుగోలుకూ లక్ష్యం..

రబీ ధాన్యం కొనుగోలు చేయమంటే తమ లక్ష్యం పూర్తయ్యిందని ఆర్‌బీకే సిబ్బంది చెప్పడంపై అయినవిల్లి మండలం రైతులు మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లోడు చేసిన ట్రాక్టర్లతో నేరుగా ముక్తేశ్వరం సెంటరుకు చేరుకుని ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన నాటి నుంచి ప్రతి వారం క్రమం తప్పకుండా తమ వద్ద ధాన్యం కొనుగోలు చేయాలంటూ జిల్లా నలుమూలలలో ఏదో ఒక చోట రైతులు రోడ్డున పడి ధర్నా చేయడం పరిపాటుగా మారింది.

రైతుల ఆందోళన

రబీ ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం ముగిసిందని ధాన్యం కొనుగోళ్లను నిలిపేయడంపై మండలానికి చెందిన రైతులు, రైతు సంఘం నాయకులు గురువారం ముక్తేశ్వరం సెంటర్‌లో ఆందోళనకు దిగారు.

ఇరవై ధాన్యం లోడు ట్రాక్టర్లలతో ముక్తేశ్వరం సెంటర్‌కు చేరుకుని, నలువైపులా ట్రాఫిక్ నిలిపివేసి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఒకవైపు ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోతున్నామని, మరో పక్క ప్రభుత్వ కేంద్రాల వద్ద లక్ష్యం పూర్తయిందని కొనడం లేదని ఆరోపించారు.

కూటమి మోసం

ధాన్యం కొనుగోలును అర్ధాంతరంగా నిలిపివేయడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక పక్కాగా ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు అందించలేదన్నారు. తాము పండించిన ధాన్యాన్ని టార్గెట్ పేరుతో కొనుగోలు చేయడం లేదన్నారు. ఇటువంటి ప్రభుత్వం అధికారంలో ఉంటే రాష్ట్ర ప్రజలు పూర్తిగా నష్టపోవాల్సిందేనన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి రాష్ట్ర ప్రజలను ఆర్థిక మాధ్యంలోకి నెట్టిందన్నారు. ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతారన్నారు.

జగన్ హయాంలో పూర్తి భరోసా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు రైతు భరోసా అందించి ఆదుకున్నారన్నారు. పండించిన పంటను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి మద్దతు ధరను అందించారని, దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపారన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధాన్యాన్ని టార్గెట్‌తో నిమిత్తం లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో రైతు సంఘ నాయకులతో అయినవిల్లి ఎస్సై పి. శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది చర్చించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చూడాలని కోరడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం ధాన్యం లోడు ట్రాక్టర్లతో అమలాపురంలోని కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా తరలివెళ్లారు.

కలెక్టరేట్ ముట్టడి

ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధాన్యం ట్రాక్టర్లతో కలెక్టరేట్‌ను ముట్టడించారు. తమ వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డీఆర్వోతో రైతులు చర్చలు జరిపారు. వారి వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు. రైతుల ఆందోళనకు వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, అయినవిల్లి మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, నాయకులు మిండగుదిటి రాంబాబు, కుసుమ సునీల్ కుమార్, బొంతు శ్రీను, కోనే చంద్రశేఖర్, చేట్ల రామారావు, కమిడి వెంకటేశ్వరరావు, కుసుమ వెంకటరమణ, మేకా బుచ్చిరామకృష్ణ తదితరులు మద్దతు తెలిపారు.



రైతులకు మద్దతుగా నిలిచిన వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు



క్లుప్తంగా

ఉపాధి శ్రామికులపై తేనెటీగల దాడి

కపిలేశ్వరపురం: మాచర గ్రామ శివారు శ్రీరామపురం ఏటిగట్టుపై జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా తుప్పలను తొలగిస్తున్న గ్రామీణ వికాస్ శ్రామికులపై గురువారం తేనెటీగలు దాడి చేశాయి. కోరుమిల్లి గ్రామ శివారు చిన్నకోరుమిల్లికి చెందిన కొండమూరి ఏసును తీవ్రంగా కుట్టడంతో అతడు అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. వెంటనే సహచర శ్రామికులు మోటారు సైకిల్‌పై కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి తరలించారు. ఆస్పత్రి వైద్యాధికారి పి.రాజ్ కుమార్ పర్యవేక్షణలో వైద్యులు చికిత్స అందించారు. ఏసు కోలుకొంటున్నాడని, మరో రెండు రోజులు పర్యవేక్షణలో ఉంచి డిశ్చార్జి చేస్తామని వైద్యులు చెప్పినట్టు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీఓ రజితసింగ్ తెలిపారు. అలాగే తేనెటీగల దాడిలో గంగుమళ్ల కృష్ణ, కోలపల్లి త్రిమూర్తులు స్వల్పంగా గాయపడ్డారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

దేవరపల్లి: బైక్‌పై వేచిఉన్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటనలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లగూడెంకు చెందిన ఈరోతు జయకృష్ణ (35) దేవరపల్లిలోని ఒక పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. గొల్లగూడెంలో గురువారం సాయంత్రం తాగునీరు తీసుకురావడానికి టిన్నులను తీసుకుని బైక్‌పై వెళుతుండగా రోడ్డుపై వేగంగా వస్తున్న లారీని గమనించి రోడ్డుపై ఆగాడు. ఇంతలో అక్కడ ఉన్న కిళ్లీ షాపు వద్ద ఆగిన ట్రక్ ఆటోను, జయకృష్ణ బైక్‌ను లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో జయకృష్ణ బైక్‌తో పాటు దూరంగా పల్లపు ప్రాంతంలో ప్రాంతంలో పడిపోయాడు. ఆటోలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, వారిని 108లో గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటి తర్వాత జయకృష్ణను గమనించి. స్థానికులు.. చికిత్స కోసం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే జయకృష్ణ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి. సుబ్రహమణ్యం తెలిపారు.

వాడపల్లి ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో గురువారం రాత్రి బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహించారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో ప్రముఖ పుణ్య క్షేత్రాలలో భక్తుల భద్రత దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా ఈ తనిఖీలు జరిపారు. ప్రధాన ఆలయంతో పాటు ప్రాంగణం, క్యూలైన్లు, ఏడు ప్రదక్షిణలు చేస్తున్న మాడ వీధులు, అన్నప్రసాద ప్రాంగణాలు, తలనీలాలు సమర్పించే ప్రాంతాలను తనిఖీ చేశారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు వాడపల్లి ఆలయంతో పాటు రావులపాలెం బస్ కాంప్లెక్స్‌లో తనిఖీలు జరిపినట్టు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు.

కుట్టిందో మరణమే..

- దోమలతో అనేక వ్యాధులు
- డెంగీ అత్యంత ప్రమాదకరం
- జాగ్రత్తలు తీసుకోకుంటే తీవ్ర నష్టం
- నేడు జాతీయ డెంగీ దినోత్సవం


ఏడిస్ దోమ



పెదపళ్లలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ (ఫైల్)

ఆలమూరు: రాత్రయితే చాలు పిలవని అతిథుల్లా మన ఇంటికి వచ్చి, తెల్లవార్లూ రక్తాన్ని పీల్చేసే దోమలతో పడే బాధలు అందరికీ అనుభవమే. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ వీటి బాధితులే. అందుకనే దోమల భారిన పడకుండా నిత్యం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాం. అయితే దోమలు కట్టడం వల్ల అనేక రోగాలు వస్తాయి. కొన్నిసార్లు ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంటుంది. దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే డెంగీ జ్వరం అత్యంత ప్రాణాంతకమైంది. నేడు జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆ వ్యాధి లక్షణాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుందాం.

దోమ కాటుతో..

దోమ కాటు ద్వారా డెంగీ జ్వరం వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ సోకిన వ్యక్తిని కుట్టిన దోమ మరొకరిని కుడితే అతడి రక్తంలో వైరస్ వెంటనే ప్రవేశిస్తుంది. ఈ వ్యాధి వచ్చిన వారు సరైన సమయంలో చికిత్స చేయించుకోకుంటే ఒక్కోసారి ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదముంది. డెంగీ జ్వరం సోకిన వెంటనే శరీరంలోని ఎముకల్లో ఉన్న గుజ్జు తగ్గిపోయి క్రమేపీ రక్త కణాల సంఖ్యపై తీవ్ర ప్రభావం చూపి అంతిమంగా మరణానికి దారి తీస్తుంది. ఏడిస్ దోమల నుంచి సోకే డెంగీ వైరస్ నాలుగు రకాలుగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. తొలి రెండు దశల్లో జ్వర తీవ్రత రోగిపై ఒక మోస్తారు ప్రభావం చూపగా, మూడో దశలో హెమరేజిక్ జ్వరం తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తుంది. తుది దశ అయిన డెంగీ షాక్ సిండ్రోమ్ సోకితే మృతి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ దోమలు పగటి సమయంలో మనుషులను కుడతాయి. మంచినీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గుడ్లు పెట్టి దోమల వృద్ధికి కారణమవుతాయి.

వ్యాధి నిర్ధారణ

డెంగీ వ్యాధిని ఏలీసా (ఎన్‌ఎస్1) పరీక్ష ద్వారా నిర్ధారణ చేస్తారు. వ్యాధి సోకిన వ్యక్తికి వివిధ రక్త పరీక్షలు నిర్వహించి, వ్యాధి తీవ్రతను గుర్తిస్తారు. డెంగీ జ్వరం తరచూ వస్తుంటే వైరస్ సంబంధిత వైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్స తీసుకోవాలి. సాధారణంగా ఉష్ణ మండల ప్రాంతంలో ఉండే దోమలు కాటు వేయడం వల్ల ఈ వైరస్ ఎక్కువగా సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడిస్ దోమల తీవ్రతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2010 మే 16వ తేదీ నుంచి జాతీయ డెంగీ దినోత్సవం జరపాలని నిర్ణయించింది. దానిలో భాగంగా ఏటా ఆ రోజున దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

డెంగీ లక్షణాలు

- ఆకస్మికంగా అధిక జ్వరం సంభవించడం (104 డిగ్రీలు)
- తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి
- తీవ్రమైన కండరాల నొప్పి
- అలసట, వికారం, వాంతులు
- చర్మంపై దద్దుర్లు, తేలికపాటి రక్తస్రావం
- చిగుళ్ల లేదా ముక్కు నుంచి రక్తస్రావం
- మూత్రం, మలం, వాంతిలో రక్తం
- శ్వాస ఆడకపోవడం
- అలసిపోవడం, చిరాకు


డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

జాగ్రత్తలు అవసరం

- డెంగీ వ్యాధి బాధితులు తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స తీసుకోవాలి
- ఆరోగ్యకరమైన వ్యక్తి శరీరంలో ఎర్ర రక్తకణాలు (ప్లేట్‌లెట్స్) సాధారణంగా 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకూ ఉండాలి.
- తెల్ల రక్త కణాలు నాలుగు వేల నుంచి 11 వేల వరకూ ఉండాలి.
- డెంగీ జ్వరం ద్వారా రక్త కణాలు లక్ష దిగువకు పడిపోతే సత్వరమే వైద్యుడిని సంప్రదించాలి.
- దీర్ఘకాలం తక్కువ రక్తకణాలు ఉంటే ప్రాణాంతక సమస్యలకు దారితీయవచ్చు.
- డెంగీ జ్వరం బారిన పడిన వ్యక్తి సరైన విశ్రాంతి, పౌష్టికాహారం తీసుకుంటే రక్తకణాల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.
- తరచూ పండ్లు, ఆకుకూరలతో పాటు ఐరన్, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



దోమకాటు వల్ల సంభవించే డెంగీ జ్వరంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వేసవిలో సైతం వర్షాలు కురుస్తుండటం వల్ల వాతావరణంలో తీవ్ర మార్పులు సంభవిస్తున్నాయి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టాలి. జ్వర లక్షణాలు ఉంటే సత్వరమే సమీప వైద్యులను సంప్రదించి, సరైన సమయంలో చికిత్స తీసుకోవాలి.

– కె.స్వర్ణలత, వైద్యాధికారి, సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి, ఆలమూరు.

క్వారీ లారీ బోల్తా


పొలంలోకి పల్టీ కొట్టిన క్వారీ లారీ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు – లంపకలోవ రహదారిలో గురువారం ఓ క్వారీ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లాటరైట్ ఖనిజాన్ని తరలించేందుకు వెళుతున్న ఆ లారీ రైతు గౌతు గంగ పొలంలో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. దీనిపై ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు. కాగా.. ఈ రహదారిలో లాటరైట్ ఖనిజాన్ని రవాణా చేసే లారీలే రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే మితిమీరిన వేగంతో వెళుతుండడంతో స్థానికులు భయపడుతున్నారు. ఇటీవలే క్వారీ లారీ ఢీకొని గేదే మృతి చెందింది. గతంలో కూడా అనేక ప్రమాదాలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి గాయపడ్డారు. రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఆటోను వెనుక వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఐదేళ్ల చిన్నారిని, ఇద్దరు మహిళలకు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం . కాగా.. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన కుటుంబ సభ్యులు ఏలూరులో శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలిసింది.

అన్నవరం.. భక్తజన సంద్రం

- రత్నగిరికి పోటెత్తిన భక్తులు
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం


సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి గురువారం వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్దసంఖ్యలో వివాహాలు జరిగాయి. నవ దంపతులు, వారి బంధువులతో కలిసి, రత్నగిరిపై స్వామివారి వ్రతాలాచరించి దర్శనం చేసుకున్నారు. దీంతో ఆలయంలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని 35 వేల మంది భక్తులు దర్శించగా, వ్రతాలు 1,800 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం చేశారు. సత్యదేవుని కల్యాణోత్సవాలు ముగియడంతో మరలా సత్యదేవుడు, అమ్మవార్లకు స్వామివారి నిత్య కల్యాణం,ఆయుష్య హోమం, వనదుర్గ అమ్మవారికి హోమాలు, సహస్ర దీపాలంకారణ, పంచహారతుల సేవలు యథావిధిగా నిర్వహిస్తున్నారు. దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు స్వామి, అమ్మవార్లకు చేయించిన వజ్ర కిరీటాలను సోమ, గురు వారాలు మినహా మిగిలిన ఐదు రోజులు అలంకరిస్తున్నారు. గురువారం పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారు, లింగాకారంలోని శివుడు నిజరూప దర్శనం ఇచ్చారు.

ఇటీవలే శుభకార్యం.. అంతలోనే విషాదం..

- ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి
- రాయవరంలో ఘటన


నాగవర్షిణి (ఫైల్)


ఘటనా స్థలంలో నాగవర్షిణిపై ఎండ పడకుండా క్లాత్ పట్టుకున్న స్థానికులు

రాయవరం: ఆ కుటుంబంలోని పెద్ద కుమార్తె ఓణీల ఫంక్షన్‌ను రెండు రోజుల క్రితమే ఎంతో ఘనంగా నిర్వహించారు. బంధువులు, స్నేహితులతో కలిసి కుటుంబ సభ్యులు ఆనందంగా గడిపారు. అక్క ఫంక్షన్‌లో చిన్న కుమార్తె ఎంతో సందడి చేసింది. రెండు రోజులు అవకుండానే ఆ బాలికను ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. శుభకార్యం జరిగిన ఇంటిలో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన పాలపర్తి వీర వెంకట సత్యనారాయణ, ఉమా మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఓణీల ఫంక్షన్‌ను రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో నిర్వహించారు. వీఆర్‌ఏగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ ఇంట శుభకార్యం జరగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఇంకా ఇంట్లోనే ఉన్నారు. కాగా.. సత్యనారాయణ వరసకు మేనల్లుడైన నెల్లూరుకు చెందిన పవన్ సత్యస్వరూప్ గురువారం సత్యనారాయణ రెండో కుమార్తె నాగవర్షిణి (11)ని మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని రాయవరం వచ్చాడు. లొల్ల వైపునకు వెళ్లిన వీరు తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. నాగవర్షిణిపై నుంచి ట్రాక్టర్ తొట్టె వెనుక చక్రాల వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడింది. పవన్ సత్య స్వరూప్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

విలవిల్లాడిన బాలిక

ట్రాక్టర్ చక్రాలు ఎక్కేయడంతో తీవ్రంగా గాయపడిన నాగవర్షిణి విలవిల్లాడింది. ఆమె వద్దకు వెళ్లడానికి ఎవ్వరూ సాహసించలేదు. సుమారు పావుగంట తర్వాత సమీపంలోని ఫొటో స్టూడియో నిర్వాహకుడు కారంపూడి సత్తిబాబు అక్కడకు వచ్చి బాలిక శరీరంపై క్లాత్‌ను కప్పాడు. ఆ తర్వాత స్థానికులు వచ్చి సాయమందించారు.

ఘటనా స్థలానికి పోలీసులు

ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికను 108లో రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మండపేటకు తీసుకువెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. సంఘటనా స్థలాన్ని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

ఇసుక లారీ ఢీకొని మహిళ మృతి

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు గామన్ బ్రిడ్జి అండర్ పాస్ సర్వీస్ రోడ్డు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వూరుకు చెందిన దాసరపూడి సుధ (45) తన కుమారుడు చరణ్‌తో కలిసి దొమ్మేరు నుంచి కొవ్వూరుకు మోటార్ బైక్‌పై వస్తున్నారు. కొవ్వూరు అండర్ పాస్ సర్వీస్ రోడ్డుకు వచ్చేసరికీ వారిని వెనక నుంచి ఇసుక లారీ ఢీకొంది. రోడ్డుపై పడిన సుధ మీద నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా.. సుధ భర్త సాయికృష్ణ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు.

శశి విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు


ర్యాంకర్లను అభినందిస్తున్న శశి విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్

ఉండ్రాజవరం: పాలిసెట్ ఫలితాల్లో శశి – వేలివెన్ను క్యాంపస్ విద్యార్థులు మరోసారి స్టేట్ ర్యాంకులతో ప్రభంజనాన్ని సృష్టించారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ గురువారం తెలిపారు. బి.శశి వెంకట్ 120కి 120 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు, ఎం.చంద్రహర్ష 3, యు.సిరి దీపిక 13, వై.చంద్రకుమార్ 17, ఎం.దుర్గా శ్రీనిధి 19వ ర్యాంకులు సాధించారని తెలిపారు. 120కి 120 మార్కులు ఐదుగురు సాధించారని, 10 లోపు 2, 50 లోపు 11, 100లోపు 19 ర్యాంకులు వచ్చాయన్నారు. పాలిసెట్‌లో తమ విద్యార్థులు 14 సార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించారని వివరించారు.

ఏపీఆర్‌జేసీలోనూ సత్తా..

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లోనూ శశి–వేలివెన్ను విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. ఎంఈసీలో ఎం.వేదార్షిత, సీజీడీటీలో ఎస్.చరణ్, ఈఈటీలో డి.సాయి చరణ్ స్టేట్ ఫస్ట్‌లు సాధించారన్నారు. 10 లోపు 25, 50 లోపు 55, 100లోపు 65 ర్యాంకులు సాధించారని, ఏపీఆర్‌జేసీలో తమ విద్యార్థులు 17 సార్లు స్టేట్ ఫస్ట్ సాధించారని తెలిపారు. ర్యాంకర్లను శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ, డైరెక్టర్ ఎం.భాస్కర్, ప్రిన్సిపాల్ షేక్ షానూర్ అభినందించారు.

యువకుడి దారుణ హత్య

కాకినాడ క్రైం: నగరానికి చెందిన ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జగన్నాథపురం ఏటిమొగకు చెందిన వాడ్రేవు కిరణ్ (20) అవివాహితుడు. చేపల వేటతో జీవనం సాగిస్తున్నాడు. స్థానికంగా నివాసం పెమ్మాడి హరీష్ అలియాస్ చిన్న భార్యతో కిరణ్‌కు వివాహేతర సంబంధం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం కిరణ్ తన స్నేహితుడు శ్యామ్‌తో కలిసి పెంపుడు కుక్కను టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలోని పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడకు హరీష్ తన స్నేహితుడు మహేష్‌తో కలిసి ఆటోలో వెళ్లాడు. మాట్లాడే పని ఉందంటూ కిరణ్‌ను ఆటోలో ఎక్కించాడు. అనంతరం వివాహేతర సంబంధంపై వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో హరీష్ తనతో తెచ్చుకున్న బీరు సీసాతో కిరణ్ గుండెల్లో పొడిచాడు. పలుమార్లు గొంతుకోసి ఆటోలోనే చంపేశాడు. మృతదేహాన్ని స్నేహితుడి సాయంతో తిమ్మాపురం సమీపంలోని నేమం వద్ద రోడ్‌కం బ్రిడ్జి వద్ద సముద్రంలోకి విసిరేశాడు. కాగా..తన కుమారుడు కనిపించడం లేదంటూ కిరణ్ తల్లి దుర్గ బుధవారం రాత్రి పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పొరుగు వారు సముద్ర తీరంలో ఉన్న కిరణ్ మృతదేహాన్ని చూసి దుర్గకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోర్టు పీఎస్ సీఐ సునీల్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించారు. నిందితులు పరారీలో ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో విజయం సాధ్యం



సాయిశివానిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆత్మవిశ్వాసం, సహనం, క్రమశిక్షణతో విజయం సాధ్యమని సివిల్స్‌లో ఆల్ ఇండియా 11వ ర్యాంకు సాధించిన ఇ.సాయి శివాని తెలిపారు. సివిల్స్ చదవాలనుకునే విద్యార్థులకు రాజమహేంద్రవరం డ్యాఫ్నీ సివిల్స్ అకాడమీ అధ్వర్యంలో స్థానిక ఆనం కళాకేంద్రంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయి శివాని మాట్లాడుతూ మొదటి ప్రయత్నంలోనే అందరూ విజయం సాధించలేరన్నారు. నిరాశకు గురి కాకుండా ప్రయత్నిస్తే విజయం తప్పక దక్కుతుందన్నారు. మరో ముఖ్య అతిథి వాజీరామ్, రవి అకాడమీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ సమర్జిత్ మిశ్రా మాట్లాడుతూ జ్ఞాపక శక్తి, మనస్తత్వం, పరిసరాలు, సిద్ధం అయ్యే విధానం మొదలైన అంశాలు విజయంపై ప్రభావం చూపిస్తాయన్నారు. రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ తప్పనిసరిగా సాధించగలను అనే నమ్మకం ఉంటేనే సివిల్స్ చదవాలన్నారు. శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ సివిల్స్‌పై ఉన్న అభిరుచితో డ్యాఫ్నీ సివిల్స్ అకాడమీ ప్రారంభించామని, తమ సంస్థ నుంచి సివిల్స్ ర్యాంకర్లుగా ఎక్కువమంది ఆవిర్భవించగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సాయి శివానిని గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసంస్థ డైరెక్టర్లు టి.శ్రీవిద్య, టి.శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బీరు బాటిళ్ల ధ్వంసం

తాళ్లపూడి: తుపాకులగూడెం పరిధిలోని ఎలియస్ బేవరెజస్ ప్రైవేటు లిమిటెడ్‌లో కాలం చెల్లిన 9,193 కేసుల బీరు బాటిళ్లను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కేవైఎంబీ కుమార్ తెలిపారు. ఆ ఫ్యాక్టరీలో కాలం చెల్లిపోయి నిల్వ ఉన్న బీరులను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని గురువారం అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ బి.స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాకినాడ డిపో నుంచి ప్రత్యేక బస్సు సదుపాయం కల్పిస్తున్నట్టు కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సరస్వతీ దాయం – పుష్కరయాత్ర పేరిట స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ నెల 22న సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు.